

# కథా కౌముది

## చిరునామా లేనోడు.. తిరువాయపాటి రాజగోపాల్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

చివరిసారి కోనప్ప ను చూసింది మూడేళ్ళ నాడు  జనవరి ఒకటిన. మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చి గ్రీటింగ్స్ చెప్పాడు "హ్యాపీ న్యూ ఇయర్ సార్" అంటూ.

"ఇల్లెలా కనుక్కున్నారు? " తెల్లారి ఏడు కూడా కాకముందే ఇంటికి నడిచొచ్చి శుభాకాంక్షలు చెబుతున్న మనిషిని చూసి ఆశ్చర్యంగా అడిగాను.

" చెప్పినారు గదా ఇంకా ఇండ్లు మొలవని  గోవర్ధన్ లే అవుట్ అనీ, దాంట్లో  ఉండే మూడు నాలుగు ఇండ్లల్లో మీదొకటి అని.  లే ఔట్ కనుక్కొవడానికి ఒకరిద్దరిని అడిగినా అంతే.  ఈడికొచ్చినాక ఇల్లు కనుక్కోడం ఏముంది ?  ఇంత సింపుల్ గా, తీర్చినట్టు కనబడే ఇల్లు కనబడ్డానే ఇదే మీ ఇల్లు  అనుకున్నా."

" రండి లోపల కూచుందాం" కాంపౌండు  గేటు తీసి వచ్చిన అతిథి ని లోనకి ఆహ్వానిస్తూ అన్నాను.

"వొద్దులే సార్..మీ పన్లు మీరు గానీయండి.  గ్రీటింగ్స్ తొట్ట తొలిగా మీకే చెప్పాలనుకోని వచ్చేసినా"

"లోపలికి రండి .. కాఫీ తాగి వెళుదురు గానీ."

" మల్లా లోపలికేంటికి..ఈన్నే ..ఈ కార్ పార్క్ లోనే రొంచేపు కూసుందాం లేండి. కుర్చీలు రెండు యేసి ఉండారుగా. " అంటూ కాళ్ళకున్న హవాయి చెప్పులు ఒక మూల గా విడిచాడు. మొత్తం అరిగిపోయి దుమ్ము నిండి ఉన్న నీలం రంగు చెప్పులు.

"కార్ పార్క్ లోని ఆ కుర్చీలు వెలుతురు బావుంటుందని ఎద్దైనా చదువుకోవడానికి మాకోసం లెండి" అని కోనప్ప మోమాటాన్ని బేఖాతరు చేస్తూ హాల్ లోకి నడిపించాను అరవై ఏళ్ళ ఆ బక్క ప్రాణిని. నాకంటే ఎత్తుగా, దాదాపు ఆరడుగులుంటాడు కోనప్ప. వొళ్ళు శుష్కించిందే గానీ మంచి రంగు, చక్కటి కనుముక్కు తీరు. వేళకి తిండీ, ఉంటానికింత గూడూ , లేకుండా ఇప్పుడే ఇలా ఉన్నాడంటే ప్రాయంలో మంచి స్ఫురద్రూపి అయి ఉంటాడు. సోఫాలో కాకుండా పక్కనే ఉన్న ప్లాస్టిక్ కుర్చీలో కూచున్నాడు. వొంటిమీద ఇస్త్రీ లేని మాసిపోయిన అరచేతుల చొక్కా, ముడతలు పడ్డ పొట్టి ప్యాంటు.

"నమస్తే మేడం.. కాఫీ టీ లాంటి యేమీ పెట్టుగోగాకన్ని" వంటింట్లోంచీ బైటకి తొంగి చూసిన నా శ్రీమతిని పలకరించాడు.

"సుందరంగా, ప్రశాంతంగా ఉండాది సార్ మీ నివాసం. రొద ల్యాకుండా ఒక కుటీరం మాదిరి"

మన అభిరుచుల్నీ, పరిసరాలనీ లెక్కకట్టి ఒక మంచి మాట చెప్పడానికి సంస్కారం ఉండాలి. పొగడ్తని క్లుప్తంగా సులభంగా చెప్పడం కోనప్ప లాంటి వాళ్ళకే సాధ్యం.

ఈ లోగా మా ఆవిడ ఆ చలికాలం ఉదయాన రెండు కప్పుల్లో పొగలు కక్కే ఫిల్టర్ కాఫీ తీసుకొచ్చి మా మధ్య టీ పాయ్ మీద సర్ది మళ్ళీ వంటింట్లోకి వెళ్ళింది.

"అబ్బా..వద్దంటే ఇనరు సార్ మీరు. మీరూ అంతే, ఆయమ్మా అంతే " అంటూనే ఆ వెచ్చటి పానీయాన్ని ఇష్టంగా, ఆత్రం గా చేతిలోకి తీసుకున్నాడు మా అతిథి. కాఫీ గ్రోలే తీరు చూస్తేనే తెలుస్తుంది ఉదయాన ఖాళీ కడుపుతో వచ్చాడని.

"ఎక్కడుంటున్నారు మీరు?"

" శరణాలయమే"

ఐదు కిలోమీటర్లు చలిలో నడిచాడన్నమాట.

" నోసుకోని బుట్న్యారు సార్ మీరు..మేడం జేసిన కాఫీ అముర్తమే" ఖాళీ కప్పులోంచి చూపు మరల్చకుండా అన్నాడు.

"ఇంకో సగం కప్పు కూడా తాగండి" అంటూ తన వాటా కాఫీ కూడా కోనప్ప కి ఇచ్చింది నా శ్రీమతి.

మాట్లాడకుండా అదీ ఖాళీ చేసాడు మహానుభావుడు.

"ఈ పొద్దు మీకు గ్రీటింగ్స్ జెప్పడమే గాదు శిన్న క్యాలెండరు గూడా బట్టకచ్చినా" అంటూ లేచి వెళ్ళి హాల్ లో టీవీ పక్కనే గోడకున్నచీలకు ఆ క్యాలెండరు విప్పి తగిలించాడు. పన్నెండు పేజీల్లో పన్నెండుగురు పసిబిడ్డలు మనోహరంగా నవ్వుతున్న సముదాయం ఆ కొత్త క్యాలెండర్.

కోనప్పమాట్లాడే యాసలో మట్టివాసన మహా ఇష్టం నాకు. నేను నిలబెట్టు కోలేని సిరి అది. మస్తకాల నిండా పుస్తకాల భాష నింపుకుని మూలాలు మరిచిపోయే వాళ్ళంటే నాకు జాలి, నాతో సహా.

"మాటలో యాస ఎట్లా నిలుపుకున్నారు మీరు" అని అడిగాను ఒకసారి.

" 'ఎట్ల' అని అడిగినారు గనక చెప్తా. అదే 'ఎందుకు' నిలబెట్టుకున్నారు అని అడిగితే చెప్పేవాన్ని గాదు. యాస నిలబెట్టుకోవడం సునాయసమేం గాదు. బుక్కులు సదివి సదివి , ఏరే యాసగలోల్లతో మాట్లాడి మాట్లాడి మనది కాందేదో మనకు అంటుకోవాలని సూస్తాది. ఆ మాయలో పడగూడదు. ఆ మటుకు జాగర్త పడినా." రహస్యం వెల్లడించాడు కోనప్ప.

"క్యాలెండర్లో బిడ్డల ఫోటో లు సూస్సానే దాన్ని మీకియ్యాలనిపించింది. ఈ సమచ్చరం మీ ఇంట్లొ పసి బిడ్డలుతిరగాడాలె. కొడుకులకు పెన్లిన్లై మూడేన్లు దాటిన్ల్యా ! మనవడితో మనవరాలితో మురిపెంగా కాలం గడపాలి ఈ సమచ్చరం. ఇదే నా కోరిక"

దశాబ్దాలు నాతో కలిసి తిరిగిన మిత్రులు గానీ, దగ్గరి బంధువులు గానీ పట్టుకోలేకపోయిన నాకున్న వెలితి ని కేవలం రెండేళ్ళ పరిచయమున్న మనిషి అర్థం చేసుకోవడం ఎంత ఊరట !

అల్పాహారం కూడా ముగించి తొమ్మిదింటికి బైటపడ్డాడు కోనప్ప . కూడావీధిలోకి నడిచి రెండు ఐదు వందల నోట్లు అందియ్యబోతే

" వద్దు సార్. ఇప్పటికే శానా బాకీ ఉండాది మీకు. ఎప్పుటికి దీర్తాదో ఏమో" అన్నాడు.

"మీ పెన్షన్ వ్యవహారం ఎందాకా వచ్చింది?"

"కొసమోపుకొచ్చింది. ఎక్కువ కాలం పట్టదులేండి "

ఆ నిష్కల్మష బైరాగి అశీర్వచనం ఫలించింది. అదే ఏడాది సెప్టెంబర్ ఎనిమిది న నా చిన్నకొడుక్కి కూతురూ, నవంబరు రెండు న నా పెద్దకొడుక్కి కొడుకూ కలిగారు. కోనప్ప కేమైనా దూరదృష్టి ఉందేమో. లేకపోతే అంత ఖచ్చితంగా ఎలా చెబుతాడు, 'మనవడితో మనవరాలితో మురిపెంగా కాలం గడపాలి ఈ సమచ్చరం' అని ? రెండేళ్ళిప్పుడు నా మనవడికీ మనవరాలికీ. మనవడిలో మా నాన్ననీ మనవరాలి లో మా అమ్మనీ చూసుకుంటున్న నా సంతోషం అపురూపం. కోనప్ప జోస్యం తరువాత మా ఇంట్లో బిడ్డల జననం కాకతాళీయమైనా కావొచ్చు. కానీ ఆ మనిషికి లోపల నా పట్ల ఉన్న ఆదరానికి, సానుభూతి కీ కళ్ళు చెమరుస్తాయి .

ఆ జనవరి ఒకటి తరువాత ఇప్పటి దాకా కోనప్ప నాకు కనబడలేదు. కోనప్ప తో పరిచయం ఉన్నచాలా మందిని అదిగినా ఫలితం లేకపోయింది. కోనప్ప దగ్గర సెల్ ఫోన్ లాంటి దేమీ ఉండదు. అప్పుడప్పుడూ రూపాయి కాయిన్ వేసి మాట్లాడే ఫోన్ నుంచే మాట్లాడేవాడు. తమాషా గా అనేవాణ్ణి 'లోకమంతా మీకు దొరకాలిగానీ మీరెవరికీ దొరకరు' అని.

★★★

అరవై దాటిన కోనప్ప ఒంటరి. కోసిగి దగ్గర్లో తుంగభద్ర ఒడ్డున ఏదో మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన కోనప్ప అక్కడి పరిసరాలు వదులుకుని మూడు వందల కిలో మీటర్ల దూరంలో మామధ్య ఎందుకని ఏడెనిమిదేళ్ళుగా ఉంటున్నాడో మాకెవరికీ తెలీదు. అసలు తనకైనా తెలుసునా అని నాకనుమానం!

ఊళ్ళో జరిగే సాహిత్య సభలకీ, నాటక సప్తాహాలకీ తప్పకుండా హాజరయేవాడు. అతనేం చదువుకున్నాడో నేనెప్పుడూ అడగలేదు. కానీ కళల గురించి, సాహిత్యం గురించీ లోతుగా తెలిసిన వాడు కోనప్ప .

"ఏం చదువుకున్నారు కోనప్పా మీరు?" అన్నాను ఒక సారి కుతూహలం అణచుకోలేక.

"సదువా మన్నా. డిగ్రీ మద్దెలోనే సాలిచ్చినా. మీబోటోల్లతో రాసక పూసక తిరిగితే ఏదో ఇంత అబ్బుతాదిగదా అనే ఈ మీటింగులకూ డ్రామాలకూ వచ్చేది".

ఎప్పుడూ సభికుల్లోనే ఉండే నేను ఒకసారి వేదిక ఎక్కి అరగంట ప్రసంగించాను. ఇంటి దగ్గర బాగా తయారయి కానీ నేను సమావేశాల్లో ప్రసంగించడానికి వెళ్ళను.వేదిక ఎక్కి నిరర్థక, అధిక ప్రసంగం చేస్తే నాకు అవమానం అనిపిస్తుంది. వారం పది రోజులు పడుతుంది నాకు ఆ శృంగభంగం నుంచి బైట పడ్డానికి. జనం చప్పట్లు కొట్టారా లేదా అని కాదు, మన అంతరంగానికి తెలుస్తుంది మనం చెప్పవలసింది చెప్పవలసిన రీతిలో చెప్పామా లేదా అని.

ఆ సభ లోనూ మంచి ప్రసంగమే చేశాను. నా తోటి వక్తలు నిత్యమూ సభల్లో మునిగి తేలే ప్రసంగీకులు.

" అద్భుతంగా మాట్లాడ్యారు సార్.. తేలిపోయినారు మిగిలిన మేదావులు" సభ ముగిశాక ఏదో మూల నుంచి దగ్గరికొచ్చి నన్ను ఆలింగనం చేసుకుని చెవిలో గుసగుస గా అన్నాడు కోనప్ప. ఆ ప్రశంస చెందాల్సింది నాకు కాదు; నేను చేసిన పూర్వాభ్యాస తతంగానికి.

"రండి ..నా కార్లో డ్రాప్ చేస్తాను. " సభ ముగిశాక నాతో తీసుకెళ్ళాను కోనప్పని.

ఒక బట్టల దుకాణానికి తీసుకెళ్ళి వద్దు వద్దంటున్నా మూడు జతల బట్టలు తీసిచ్చాను. ఒక రెస్టారెంటు దగ్గర కారాపి మంచి భోజనం పెట్టించాను. కారు దిగి శరణాలయం లోకి వెళ్తున్న కోనప్ప జేబులో ఒక పది వంద రూపాయల నోట్లు బలవంతంగా తోశాను. నా ధారాళత్వానికి బిక్క మొహం వేస్తే వేశాడు గానీ, నాకు తెలుసు జేబులో చిల్లి గవ్వ కూడా ఆ నిర్భాగ్యుడి దగ్గర ఉండదని.

నేను కోనప్ప పట్ల చూపే ఉదారత్వం అతను నాపై గుప్పించే పొగడ్తలకి నేనిచ్చే నజరానా కానే కాదు. పొగడ్తలకి వెదజల్లేంత డబ్బు నాకు లేదు. వయసూ, చూసేసిన జీవితం నేర్పిన పాఠాలు , ఆ శుష్క సంతృప్తులకు నన్ను అతీతుణ్ణి చేశాయి. రెండేళ్ళ మా పరిచయం లో కోనప్పకు నేను ఇచ్చిన మొత్తం పది వేలుకూడా దాటదు.

★★★

సాయి వృద్ధాశ్రమం. చాలా మురికిగా, గాలీ వెలుతురూ లేకుండా, దుర్వాసన కొడుతూ ఉంది. అలాంటి శిబిరాలు నడపడానికి డబ్బు పోగు చెయ్యడం, దాతలిచ్చిన సొమ్ము సవ్యంగా ఖర్చుపెట్టడం, దేని కష్టాలు దానికున్నాయి. కోనప్ప గురించి వాకబు చెయ్యడానికి వెళ్ళానక్కడికి.

" కోనప్పను ఎలా మరిచి పోతాం సార్. ఒకసారి పరిచయం అయితే ఎన్నటికీ మరిచిపోలేం ఆ మనిషిని " అన్నాడు అక్కడి వ్యవహారాలు చూసే ఒక మధ్యవయస్కుడు.

" ఇప్పుడు కోనప్పఇక్కడ ఉండడం లేదా?"

" మూడేళ్ళ క్రితం జనవరి ఒకటిన ఇక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు."

" అంత మంచి మనిషి వెళ్ళిపోతుంటే మీరు ఆపలేదా”?"

"మాతోనే ఉండండి అని అడిగాను. విన లేదు. "

"ఎందుకు వెళ్ళిపోతున్నానని చెప్పాడు ?"

"ఫోర్త్ స్టేజ్ క్యాన్సరు ఉండేది ఆయనకు అప్పటికే. లోకల్ డాక్టర్ ఎవరో ట్రీట్ చేసేవాడు. అంత జబ్బున్నా ఎప్పుడూ ఎవరితోనూ అనే వాడు కాదు. ఎక్కడికెళ్ళినా నడిచే వేళ్ళేవాడు. ఒకరకంగా చెప్పాలంటే ఆరోగ్యం అభినయించేవాడు. జేబులో ఎప్పుడైనా వెయ్యో రెండు వేలో ఉంటే ఆశ్రమం ఖర్చులకి ఉంచుకొమ్మని మాకే ఇచ్చేవాడు.దాదాపు మూడేళ్ళున్నాడు శరణాలయం లో. చిమ్మడం, బూజు దులపడం లాంటి పనులు ఎవరూ అడక్క పోయినా తానే చేసేవాడు. ఇక్కడుంటున్నందుకు కిరాయి ఇవ్వడం అనుకునే వాడు ఆ పనులు చెయ్యడం."

కోనప్పకు క్యాన్సరా ? అంత అభిమానంగా ఆ రోజు మా ఇంటి కొచ్చి అపురూపమైన మాటలు చెప్పిన ఆ మనిషి జబ్బు అసలు గ్రహించలేక పోయిన నా కడుపు నిండిన తనం నాకే వెగటనిపించింది. మీరు బాగున్నారా అన్న కనీస కుశల ప్రశ్న వెయ్యలేదు నేను.

"ఆయన కుటుంబం గురించి ఏమైనా తెలుసా?"

"ఎవ్వరూ లేరు. భార్య పదేళ్ళ క్రితం చనిపోయిందనీ, ఏకాకి ననీ చెప్పాడు ఒకసారి. "

"ఇప్పుడెక్కడున్నాడో తెలుసా"

"ఇక్కణ్ణుంచీ నేరుగా తిరువన్నామలై వెళ్ళాడు. వెళ్ళిన ఇరవై రోజులకు ఆ పుణ్య క్షేత్రం లో అనాధగా తనువు చాలించాడు. ధార్మికులెవరో అంత్య క్రియలు చేసేశారట. పోయాక మాకు తెలియ చెయ్యమని సంచి లో ఒక కాగితం రాసి ఉందని అక్కడి పోలీసులు మాకు ఫోన్ చేశారు"

నోట మాట రాలేదు నాకు.కోనప్ప అనాధ ఎలా అవుతాడు ? ఎందరికో స్వాంతన పంచుతూ ఎంపిక చేసుకుని అనామకుడుగా ఉండిపోయాడు. లాభ నష్టాల లావాదేవీలూ, ఆడంబరాలూ అంటకుండా నిరుపేద గానే బతికేసిన ఋషి కోనప్ప. అందుకేనేమో అతని ఆకాంక్ష నా నట్టింట నిజమై నిలిచింది.

"మీరేమౌతారు ఆయనకి ? "

సమాధానమివ్వలేని ప్రశ్న అది. ఏమైనా అవుతానా నేను కోనప్పకి? నడిచే కొండ గుర్తు కోనప్ప.

నా ఇల్లు, నావాళ్ళ గురించే తాపత్రయ పడే కోట్లాది జనం లో నేనొకడు. బరువెక్కిన గుండెతో బైటకి నడిచాను.

★★★

COMMENTS